# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 14-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ వేదికపై భారత ఆర్థిక శక్తి పెరుగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్లో విజయం సాధించిన క్రీడాకారుడు ధీరజ్ బొమ్మదేవరకు ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు.**
3. **ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.**
4. **తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈరోజు అంకురార్పణతో ప్రారంభమవుతాయి.**
5. **హిందీ భాషా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ప్రపంచ వేదికపై భారత ఆర్థిక శక్తి పెరుగుతోందని, తద్వారా అంతర్జాతీయంగా దేశ ప్రాధాన్యత మరింత బలపడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. బ్రిక్స్ సదస్సును విజయవంతంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారం, సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, విభిన్న దేశాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో భారత్ కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. ఏకాభిప్రాయ సాధనకు భారత్ ఒక వేదికగా ఎదిగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగియడం దేశానికి గర్వకారణమని ఉపముఖ్యమంత్రి కే. పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. ఏకపక్ష యుద్ధాల్ని ఖండిస్తూ బ్రిక్స్ ఉమ్మడి డిక్లరేషన్ చేయడం చారిత్రాత్మకమని తెలిపారు.

--------------------------

ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా గణపతి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ... రాష్ట్ర ప్రజలందరూ సుఖ

సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. విజయవాడ, మచిలీపట్నం, విశాఖపట్నం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరులోని కాణిపాకం తదితర జిల్లాల్లో గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి తొలి పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఆలయాలు, మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

---------------------------

మెక్సికో దేశంలోని సాల్టిల్లోలో జరిగిన ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌లో విజయం సాధించిన భారత ఆర్చరీ క్రీడాకారుడు ధీరజ్ బొమ్మదేవరకు ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. రికర్వ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో జపాన్‌కు చెందిన జున్యా నకనిషి ని ధీరజ్ ఓడించి స్వర్ణ పతకం సాధించారని తెలిపారు. విజయవాడకు చెందిన ధీరజ్ చిన్న వయసులోనే ఆర్చరీలో ప్రస్థానం ప్రారంభించి, అంకితభావం, కచ్చితత్వం, పట్టుదలతో ప్రపంచ స్థాయికి ఎదిగారని తెలిపారు. ఈ విజయం భారత ఆర్చరీలో ఒక మైలురాయిగా నిలిచిందని, భారత క్రీడాకారుల ప్రతిభకు, క్రమశిక్షణకు, సంకల్పానికి ఇది నిదర్శనమని పవన్ కల్యాణ్ అన్నారు.

---------------------------

నెల్లూరు నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి 234 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని సర్వేపల్లి కాల్వకట్ట ప్రాంతాన్ని మంత్రి గత రాత్రి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సర్వేపల్లి కాల్వకట్టపై నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. త్వరలోనే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఇంటి పట్టాలను అందజేస్తామని మంత్రి నారాయణ పేర్కొంటూ..

వాయిస్..30. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విశాఖపట్నంలో ఏపీ చాంబర్-2026 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎక్స్‌పోను హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో పరిశ్రమల ఏర్పాటుకు 24 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, 19 పరిశ్రమలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, మరో 138 నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈరోజు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుని పర్యవేక్షణలో ఆలయంలోని యాగశాలలో రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య ఈ క్రతువును నిర్వహిస్తారు. రేపు సాయంత్రం 6 గంటల 21 నిమిషాల 6 గంటల 35 నిమిషాల

మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్పిస్తారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా రేపటి నుంచి ఈనెల 20వ తేదీ వరకు సర్వ దర్శనం, దివ్య దర్శనం టోకెన్ల జారీ నిలిపి వేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది.

------------------------

భారతదేశ అధికార భాషగా కేంద్రప్రభుత్వం హిందీని అమలు పరచిన ఈరోజును హిందీ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. దేవనాగరి లిపిలో ఉన్న హిందీ భాషను 1949 సెప్టెంబర్ 14వ తేదీన కేంద్ర ప్రభుత్వం – అధికార భాషగా గుర్తించి, రాజ్యాంగంలో చేర్చడం వల్ల ఏటా ఈ రోజును హిందీ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష ప్రాముఖ్యాన్ని తెలియజేయడం, హిందీని అంతర్జాతీయ భాషగా ప్రదర్శించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1963వ సంవత్సరంలో రూపొందించిన అధికార భాషా చట్టం ప్రకారం 1965 నుంచి హిందీ, ఆంగ్ల భాషలు అధికార భాషలుగా కొనసాగుతున్నాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై ఉంచడంలో హిందీ భాష ఆ రోజుల్లో ఎంతగానో సహాయపడింది.

------------------------

దేశంలోని మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. సమతుల ఆహారం, తల్లిపాల ప్రాధాన్యం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాలింతలు, చిన్నారులకు సకాలంలో అవసరమైన పోషకాహార పదార్థాలు అందుతున్నాయని కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన లబ్ధిదారురాలు సేతు అఖిలాండేశ్వరి తెలియజేస్తూ...

వాయిస్.. 25 సెకన్లు

------------------------

రాష్ట్రంలోని వైద్య, దంత వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ ప్రవాస భారతీయుల కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆరోగ్య విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న ప్రైవేటు, నాన్ మైనారిటీ, మైనారిటీ వైద్య, దంత కళాశాలలు, తిరుపతి శ్రీపద్మావతి మహిళా కళాశాలలో సీట్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని వెల్లడించింది.

------------------------

ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కొత్త నిబంధనలు–2026ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ నిబంధనలు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, విస్తరించిన ఉత్పత్తిదారు బాధ్యత సూత్రాలకు నిబంధనల్లో ప్రాధాన్యత ఇచ్చారు. వ్యర్థాలను ఉత్పత్తి చేసే ప్రదేశంలోనే నాలుగు వర్గాలుగా వేరు చేయడం తప్పనిసరి చేశారు. వ్యర్థాల సరైన విభజన, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు.

====================